## క్లుప్తంగా...

### అక్రమ నిర్మాణాలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



**మేడిపల్లి:** మేడిపల్లి సర్వే నంబర్–62 ప్రభుత్వ భూమిలో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూమిలో 60గజాలు, 100 గజాలుగా అనధికారికంగా ప్లాట్లు చేసి అమాయకులకు విక్రయిస్తున్నారని, ఈ విషయంపై మేడిపల్లి తహసీల్దార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్–62 ప్రభుత్వ భూమిలో సుమారు 100 ఇళ్ల వరకు అక్రమ నిర్మాణాలు ఉన్నాయని, తక్షణమే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ అక్రమ నిర్మాణాలను గుర్తించి వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ వార్డు మెంబర్ కె.దేవ్‌సింగ్ నాయక్, దుబ్బాక జైహింద్ గౌడ్, విజయ్ కుమార్, నవీన్, జకరయ్య, వజిత్ పాల్గొన్నారు.

### జర్నలిస్టులు పోరాటాలకు సిద్ధం కావాలి

**అల్వాల్:** జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మల్కాజిగిరి జర్నలిస్టుల పోరాట కమిటీకి అణగారిన ప్రజల హక్కుల పోరాట కమిటీ, గద్దర్ అభిమానుల సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తోందని సీఎల్ యాదగిరి పేర్కొన్నారు. జర్నలిస్టులు పనిచేస్తున్న ప్రాంతంలో ఇంటి స్థలం ఇవ్వాలని, కుటుంబానికి ఆరోగ్య భద్రత, పిల్లలకు ఉన్నత ప్రమాణాలతో విద్య, గుర్తింపు ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

### కుక్క మృతికి కారకులైన దంపతులపై కేసు

**మేడిపల్లి:** ఓ కుక్కపై దాడికి పాల్పడిన దంపతులపై కేసు నమోదైన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పర్వతాపూర్ ప్రాంతానికి చెందిన నరేష్ కుటుంబ సభ్యులు బ్రౌని అనే పేరుతో పెంచుకుంటున్న కుక్క రెండు రోజుల క్రితం పక్కనే ఉన్న రవి ఇంట్లోకి వెళ్లింది. దీంతో ఇంటికి వచ్చిన కుక్కపై రవి దంపతులు దాడిచేయడంతో తీవ్రగాయాలై చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. దీంతో రవి దంపతులపై చర్యలు తీసుకోవాలని నరేష్ ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

### వైద్య శిబిరానికి స్పందన



**రామంతాపూర్:** గోకుల్‌నగర్‌లోని బాలభారతి పాఠశాలలో స్థానిక సీనియర్ సిటిజన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. వివిధ స్పెషాలిటీ డాక్టర్లు రోగులను పరీక్షించి ఉచిత మందులు పంపిణీ చేశారు. డాక్టర్ మమత, డాక్టర్ జలరోహిణి, సీనియర్ సిటిజన్ సంఘం అధ్యక్షుడు సత్తి రాజు, కపర్తీశ్వరరావు, కేదారేశ్వరరావు, కోటేశ్వరరావు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజిబరిలో గెలిచేదెవరో..?

● ఆనవాయితీ కొనసాగేనా..? ● ముక్కోణం పోటీ ఖాయం

**మల్కాజిగిరి:** కంటోన్మెంట్ నియోజకవర్గంలో భాగమైన మల్కాజిగిరి, అల్వాల్ ప్రాంతాలు 2009 నియోజకవర్గాల పునర్విభజన తర్వాత మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడింది. రైల్వే, ఐటీ ఉద్యోగులు, విద్యావంతులకు ఎక్కువగా నియోజకవర్గంలో ఉన్నారు. ఇప్పటికీ మల్కాజిగిరి నియోజకవర్గంగా ఏర్పడిన తర్వాత జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తులు తిరిగి మరోసారి గెలవలేదు. మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆకుల రాజేందర్, కనకారెడ్డికి మరోసారి పోటీచేసే అవకాశం లభించలేదు. 2018 ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ నుంచి ఈ సారి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. అదే ఆనవాయితీ కొనసాగుతుందో.. లేక మైనంపల్లి గెలిచి రికార్డు సృష్టిస్తారో ప్రజల తీర్పుతో తెలుస్తుంది.

- ◆ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు జరిగిన 2009 ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆకుల రాజేందర్, తన ప్రత్యర్థి ప్రజారాజ్యం పార్టీకి చెందిన చింతల కనకారెడ్డిపై 9,195 ఓట్ల మెజార్టీతో గెలిచారు. టీడీపీ అభ్యర్థి శారదామహేష్ మూడో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపులో అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్సార్ చేసిన అభివృద్ధి కీలకంగా పనిచేసింది.
- ◆ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్న చింతల కనకారెడ్డి, బీజేపీ అభ్యర్థి రాంచందర్‌రావుపై 2,768 ఓట్ల మెజార్టీతో గెలిచారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నందికంటి శ్రీధర్ మూడో స్థానంలో, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సూర్యనారాయణరెడ్డి నాల్గో స్థానంలో నిలిచారు.
- ◆ 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన మైనంపల్లి హన్మంతరావు సమీప ప్రత్యర్థి బీజేపీకి చెందిన రాంచందర్‌రావుపై 73,698 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. కాంగ్రెస్, తెలంగాణ జనసమితి పార్టీ పొత్తులో భాగంగా పోటీ చేసిన కపిలవాయి దిలీప్‌కుమార్ మూడో స్థానంలో నిలిచారు.

**2009 ఎన్నికల వివరాలు:**

| | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 3,51,506 |
| పోలైన ఓట్లు | 1,91,957 |
| పోస్టల్ బ్యాలెట్ | 172 |
| ఆకుల రాజేందర్ కాంగ్రెస్ | 56,629 |
| సి.కనకారెడ్డి పీఆర్పీ | 47,434 |
| శారదామహేష్ టీడీపీ | 47,326 |
| గెలుపు: ఆకుల రాజేందర్ | 9,195 ఓట్లతో.. |

**2014 ఎన్నికల వివరాలు:**

| | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 4,46,678 |
| పోలైన ఓట్లు | 2,31,202 |
| పోస్టల్ బ్యాలెట్ | 716 |
| నోటా: | 1,965 |
| సి.కనకారెడ్డి(టీఆర్ఎస్) | 77,132 |
| రాంచందర్‌రావు(బీజేపీ) | 74,364 |
| నందికంటి శ్రీధర్(కాంగ్రెస్) | 37,201 |
| జి.సూర్యనారాయణరెడ్డి(వైసీపీ) | 14,828 |
| గెలుపు: చింతల కనకారెడ్డి | 2,768 ఓట్లతో. |

**2018 ఎన్నికల వివరాలు:**

| | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 3,93,679 |
| పోలైన ఓట్లు | 2,09,499 |
| పోస్టల్ బ్యాలెట్ | 528 |
| నోటా | 3,391 |
| మైనంపల్లి హన్మంతరావు(టీఆర్ఎస్) | 1,14,149 |
| రాంచందర్‌రావు (బీజేపీ) | 40,451 |
| కపిలవాయి దిలీప్‌కుమార్ (టీజేఎస్) | 34,219 |
| గెలుపు:మైనంపల్లి హన్మంతరావు, | 73,698 ఓట్లతో.. |



**ప్రస్తుత పరిస్థితి:**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా రాజీనామా చేసిన మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తుండగా, మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావుతో పాటు పార్టీ కార్పొరేటర్లు శ్రవణ్, రాజ్యలక్ష్మి, సునీతాయాదవ్, బీజేవైఎం నాయకులు టీంసాయి, భానుప్రకాష్ ఎమ్మెల్యే టికెట్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటిదాకా అధికారికంగా ఏ పార్టీ కూడా అభ్యర్థిని ప్రకటించలేదు.

# యువత చూపు.. ఎటువైపు..?

జంగ్ 2023 తెలంగాణ

- ● దాదాపు 67 శాతం యువఓటర్లే..
- ● వారు ఎటువైపు మొగ్గు చూపితే..
- ● ఆ పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయం..
- ● వారిని ప్రసన్న చేసుకునే దిశగా..
- ● అన్ని పార్టీల ప్రయత్నాలు



**ఉప్పల్:** ఉప్పల్ నియోజవర్గంలో యువ ఓటర్లతోనే అభ్యర్థుల భవితవ్యం ముడిపడి ఉంది. వారు ఎటువైపు మొగ్గు చూపితే వారే గెలిచే పరిస్థితి ఉప్పల్‌లో ఉంది. దీనికి కారణం యువకులే పెద్ద మొత్తంలో ఓటర్లుగా ఉండటం. ఉప్పల్ నియోజకవర్గంలో మొత్తం 5,10,187 ఓటర్లు ఉన్నారు. 20 నుంచి 29 వయస్సు గల ఓటర్లు 79,206 ఉండగా 30 నుంచి 39 మధ్య వయస్సుగల వారు 1,44,042 మంది ఓటర్లు, 40 నుంచి 49 మధ్య వయస్సు గల వారు 1,23,432 మంది ఓటర్లు అంటే 3,46,680 ఓటర్లు 20 నుంచి 49 మధ్య వయస్సు గల వారే ఉండటం గమనార్హం. దాదాపు 67 శాతానికి పైగా యువ ఓటర్లే ఉన్నారు. కొత్తగా ఓటు హక్కు సంపాదించుకున్న వారు 7,097 ఉన్నారు. యువతరం ఏ పార్టీ వైపు మొగ్గుచూపితే.. ఆ పార్టీ అభ్యర్థి గెలిచే అవకాశం ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తం ఓటర్లతో పురుషులు, మహిళలు దాదాపుగా సమాన నిష్పత్తిలో ఉన్నారు. పురుషులు 2,65,493 ఉండగా మహిళా ఓటర్లు 2,44,657 మంది ఉన్నారు. యువతను ప్రసన్నం చేసుకునే దిశగా అన్ని పార్టీల అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు.

## ఆరు గ్యారెంటీలకు ప్రజల్లో మంచి స్పందన



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న కాలనీవాసులు

**బోడుప్పల్:** ఆరు గ్యారెంటీ పథకంతో కాంగ్రెస్‌కి మంచి స్పందన లభిస్తోందని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తిరుమల మెడోస్, హేమానగర్, ఈదయ్యనగర్, రెడ్డీస్ కాలనీ, న్యూహేమానగర్ కాలనీల్లో నిర్వహించిన గడప గడప కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాల వల్ల మేడ్చల్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పడతారన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసి కాంగ్రెస్‌కు బహుమతిగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నం తరుణ్‌గౌడ్, మేడ్చల్ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, తోటకూర అజయ్‌యాదవ్, నేతలు బొమ్మక్ రమేష్, పోగుల వీరారెడ్డి, వెంకటేశ్‌గుప్తా, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక**

తిరుమల మెడోస్‌కు చెందిన పలువురు కాలనీ ప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. కాలనీ అధ్యక్షుడు అమరేందర్, ప్రధాన కార్యదర్శి వెంకట మెదిశెట్టి గుప్తా, ఉపాధ్యక్షుడు ఓరుగంటి ఆంజనేయులు గుప్తా, రసూల్ బాషా, నర్సింగ్‌రావు, కృష్ణమూర్తి, హర్షవర్ధన్, గంగాధర్, శ్రీకాంత్, బాలరాజ్, రామకృష్ణ, రమణ, శ్యాంరావు, నర్సింగ్‌రావు, రాములు, ఆంజనేయులుగౌడ్, యమునరెడ్డి, ప్రేమలత, జయమ్మ తదితరులున్నారు.

## లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌కు అవార్డు




అవార్డు అందుకుంటున్న కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి

**బోడుప్పల్:** బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌కు సూపర్ 30 బడ్జెట్ ప్రైవేట్ స్కూల్స్ నేషనల్ లెవెల్ ఎడ్యుకేషనల్ వరల్డ్ అవార్డు వచ్చింది. న్యూఢిల్లీలోని మ్యారెడ్ హోటల్‌లో ఈ అవార్డ్స్ అందించగా లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్స్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అందుకున్నారు. అనంతరం బోడుప్పల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో మూడు స్కూల్స్‌కు ఈ అవార్డులు రాగా అందులో లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ ఒకటన్నారు. టీచర్స్ ట్రైనింగ్స్, అకాడమిక్ రెపిటేషన్స్, చదువుతోపాటు ఇతర యాక్టివిటీస్(క్రీడలు, యోగా, కరాటే, డ్యాన్స్, మ్యూజిక్, చెస్,) స్పోర్ట్ ఎడ్యుకేషన్, విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికలు, ఇన్డివిడ్యువల్ అటెన్షన్, లీడర్‌షిప్, మేనేజ్‌మెంట్ క్వాలిటీ, పరిసరాలు, పరిశుభ్రత, వ్యాల్యూ మణి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర విషయాలను ప్రామాణికంగా తీసుకుని ఈ అవార్డు ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రతి విద్యార్థి భవిష్యత్ ప్రణాళికను దృష్టిలో పెట్టుకుని, ఎలాంటి ఒత్తిడి లేని విద్యను బోధిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించే విధంగా సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. అవార్డు రావడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు.

## తిరుమల అర్బన్ బ్యాంక్‌ను ప్రారంభించిన చినజీయర్ స్వామి



బ్యాంక్ ప్రారంభోత్సవంలో చినజీయర్ స్వామి తదితరులు

**మేడిపల్లి:** మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తిరుమల కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌ను చిన జీయర్ స్వామి, మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, సినీ నటుడు సుమన్ సోమవారం ప్రారంభించారు. అనంతరం చిన జీయర్ స్వామి మాట్లాడుతూ.. బ్యాంక్ ప్రారంభోత్సవానికి ఇంత మంది స్వామీజీలు అయోధ్య, కేదర్‌నాథ్‌ల నుంచి వచ్చి ఆశీర్వదించడం అభినందనీయం అన్నారు. ఇకముందు తిరుమల అర్బన్ బ్యాంక్ ఎన్నో బ్రాంచ్‌లను పెట్టాలని పేర్కొన్నారు.

సినీనటుడు సుమన్ మాట్లాడుతూ.. ఇంత మంది స్వామీజీల మధ్య కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్, కార్పొరేటర్లు తూముకుంట్ల ప్రసన్న లక్ష్మి శ్రీధర్‌రెడ్డి, మద్ది యుగేందర్‌రెడ్డి, కౌడె పోచయ్య, జావీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### వాహన తనిఖీల్లో రూ.30 లక్షల పట్టివేత



**కుషాయిగూడ:** వాహన తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడుతోంది. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాల్లూరి థియేటర్ వద్ద సోమవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. అటువైపుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న నల్ల సతీష్‌కుమార్ వాహనాన్ని తనిఖీ చేయగా బ్యాగులో రూ.30 లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐలు ఉపేందర్‌యాదవ్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

### వైన్‌షాపుల వారికి నగదు అనుమతించాలి

**ఉప్పల్:** ఎలక్షన్ కోడ్ పేరిట ఎస్‌వోటీ పోలీసులు వైన్‌షాపుల నుంచి తీసుకెళ్తున్న నగదును జప్తు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ఉప్పల్ పరిధిలోని దాదాపు వైన్ షాపులను మూసివేసి నిరసన తెలిపారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వైన్‌షాపు యాజమానులు మాట్లాడుతూ రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పలు వైన్‌షాపుల వ్యాపారం పూర్తికాగానే రాత్రి సమయంలో బయటకు తీసుకువెళ్తున్న నగదును ఎస్‌వోటీ అధికారులు సీజ్ చేస్తున్నారని, దీంతో వ్యాపార లావాదేవిలు నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పల్ పరిధిలోనే రెండు రోజుల్లో దాదాపు రూ.30 లక్షలకు పైగా నగదు సీజ్ చేశారని అన్నారు. డబ్బు తీసుకువెళ్లే సమయంలో షాప్ లైసెన్స్, ఐడీ కార్డులను చూపించే విధంగా అనుమతించాలని కోరారు.

### కస్టోడియన్ ల్యాండ్ ఆక్రమణకు యత్నం



**కాప్రా:** కొందరు వ్యక్తులు కాప్రా డివిజన్ సాకేత్ సమీపంలో ప్రభుత్వ ఆధీనంలోని కస్టోడియన్ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించారు. 141, 142, 143 సర్వే నంబర్లలోని 18 ఎకరాల 35 గుంటల భూమిలో సోమవారం కొందరు వ్యక్తులు చదును చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న కాప్రా మండల రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఈ విషయంపై కాప్రా మండల తహసీల్దార్ ఎస్.మతిన్ మీడియాకు తెలుపుతూ.. ప్రభుత్వ భూమి అయిన కస్టోడియన్ భూములు ఆక్రమణకు గురవుతున్నాయనే సమాచారం మేరకు అక్కడికి ఆర్ఐ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బందిని పంపి పరిశీలించినట్లు తెలిపారు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించి, భూఆక్రమణకు యత్నిస్తూ ప్రభుత్వ భూమిలో కొందరు జేసీబీలతో చదును చేస్తుండగా వారిని అడ్డుకుని వాహనాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంలో మండలి రాజు అనే వ్యక్తితో పాటు మరికొందరిపై జవహర్‌నగర్ పీఎస్‌కు కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించాలని ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అండగా ఉంటా.. ఆశీర్వదించండి



మహిళలతో సమావేశమైన మర్రి రాజశేఖర్‌రెడ్డి

**మల్కాజిగిరి:** సమస్యలను పరిష్కరించి అండగా ఉంటానని రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మల్కాజిగిరి డివిజన్ మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ ఆధ్వర్యంలో కృష్ణానగర్, బలరాంనగర్, ఎస్పీనగర్ కాలనీవాసుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలను రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నాడన్నారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వీరేశంయాదవ్, గొలికర్ రవీందర్, వినయ్‌గౌడ్ శ్రీకాంత్, జయశ్రీ, వాసంతి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం



ఏకగ్రీవ తీర్మానాన్ని అందజేస్తున్న కాలనీవాసులు

**మల్లాపూర్:** మాయల ఫకీరు మాటలు ప్రజలు నమ్మరని బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ ఆధ్వర్యంలో రాఘవేంద్రనగర్‌లో సాయిబాబా ఆలయంలో పూజల అనంతరం ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. గడపగడపకూ తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం బీఆర్ఎస్‌తోనే ఉప్పల్ అభివృద్ధి సాధ్యమన్నారు. అందరి సంక్షేమం కోసం బీఆర్ఎస్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్రనగర్, పోచమ్మ దేవాలయం ఫేజ్– 2 కాలనీవాసులు ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి అందజేశారు. వేముల మారయ్య, మీసాల యాదగిరి, బీసీ సెల్ అధ్యక్షులు విఠల్‌యాదవ్, యాదగిరి, రాజబాబు, పెంటయ్య, అశోక్, పాండు నాయక్, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ఉప్పల్ డివిజన్‌లో అభివృద్ధి రుచి చూపించా..

ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి పరమేశ్వర్‌రెడ్డి



ఉప్పల్‌లో మాట్లాడుతున్న అభ్యర్థి పరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్:** కాంగ్రెస్ అంటేనే అభివృద్ధి అని, అభివృద్ధికే ఓటు వేయాలని ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి సోమవారం ఉప్పల్‌లో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో పిలుపునిచ్చారు. ఉప్పల్ డివిజన్‌లో అభివృద్ధి అంటే ఏమిటో రుచిచూపించానని, అదేవిధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పనిచేస్తానని, అందుకు తనను పెద్ద మనస్సుతో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు సైనికుడిలా పని చేయాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి, తెల్కల మోహన్ రెడ్డి, చెన్‌రెడ్డి రఘుపతి రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగుల పింఛన్ పెంపు ప్రకటనపై హర్షం

**మల్కాజిగిరి:** దివ్యాంగుల పింఛన్ మొత్తం పెంచడాన్ని మ్యానిఫెస్టోలో కేసీఆర్ ప్రకటించడంపై మల్కాజిగిరి పట్టణ వికలాంగుల సమాఖ్య సంఘం హర్షం వ్యక్తం చేసింది. సోమవారం మల్కాజిగిరి చౌరస్తాలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అధ్యక్షుడు సుల్తాన్ రమేష్ మాట్లాడుతూ దశలవారీగా దివ్యాంగుల పింఛన్ పెంచడాన్ని మ్యానిఫెస్టోలో చేర్చడం వల్ల చాలామందికి ఉపయోగపడుతుందన్నారు. మహ్మద్, ఈశ్వరయ్య, అలీ, సతీష్, రవి, వెంకటయ్య, వీరప్ప తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ చిత్రపటం వద్ద దివ్యాంగులు

# కాంగ్రెస్‌లో వసూల్ రాజాలకే టికెట్లు



ఉప్పల్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ అసమ్మతి నేతలు

**ఉప్పల్:** కాంగ్రెస్ పార్టీకి 25 ఏళ్లుగా పనిచేసిన రాగిడి లక్ష్మారెడ్డికి టికెట్ కేటాయించకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైనట్లు టీపీసీసీ మాజీ కార్యదర్శి పూడూరి జితేందర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అనంతరం ఉప్పల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలు బాధాకరం అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆ పదవికి అర్హుడు కాదన్నారు. రాగిడి లక్ష్మారెడ్డికి టికెట్ దక్కకపోవడంతో పార్టీకి రాజీనామా చేసినట్లు, తనతో పాటు దాదాపుగా 50 మంది నాయకులు, కార్యకర్తలు పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. ఉప్పల్, అంబర్‌పేట, జనగాం పోలీస్ స్టేషన్ల పరిధిల్లో కేసులు, నేర చరిత్ర ఉన్న వ్యక్తికి టికెట్ ఎలా కేటాయించారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్ సీటు, స్టేట్ జనరల్ సెక్రటరీ పదవి, ప్రచార కమిటీ సభ్యులు, ఏ– బ్లాక్ అధ్యక్ష పదవి, ఎమ్మెల్యే టికెట్ తదితర ఇలా పదవులన్నీ ఒకే ఇంటికి కేటాయిస్తే పార్టీని నమ్ముకున్న వేలాది మంది కార్యకర్తల సంగతేమిటో టీపీసీసీ చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటుకు నోటు పోయింది.. అంగట్లో కాంగ్రెస్ సీట్లను అగ్రాస్ పాడుతున్నాడని ఎద్దేవా చేశారు. త్వరలో కార్యచరణ ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

# రిజిస్ట్రేషన్లు నిలిపి వేయడంతో ఇబ్బందులు

- ● ఆవేదన వ్యక్తం చేస్తున్న శ్రీసాయి కృష్ణానగర్ కాలనీ బాధితులు
- ● కారణం చెప్పకుండా రిజిస్ట్రేషన్ల నిలిపివేశారంటూ ఆరోపణలు

**కుషాయిగూడ:** అకారణంగా ప్లాట్ల రిజిస్ట్రేషన్లను నిలిపివేయడంతో ఇబ్బందులు పడుతున్నాం.. మూడు నెలల క్రితం వరకు సజావుగా సాగిన ప్లాట్ల రిజిస్ట్రేషన్ల ప్రకియను నిలిపివేసి అధికారులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని శ్రీసాయికృష్ణానగర్ కాలనీలో ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ నిలిపివేయడానికి సరైన కారణం చెప్పకుండా తమకు నష్టం కలిగించడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు సైతం భారీ నష్టం వాటిల్లేలా అధికారులు వ్యవహరిస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. 2003లో చర్లపల్లి డివిజన్ సర్వే నంబర్ 177లో శ్రీసాయికృష్ణానగర్ కాలనీ ఏర్పడింది. 211 ప్లాట్లతో ఏర్పడిన ఈ కాలనీలో కొంత కాలం పాటుగా రిజిస్ట్రేషన్లు సజావుగానే సాగాయి. ఆ తర్వాత ఈ సర్వే నెంబర్ పక్కనే ప్రభుత్వ స్థలం ఉందని ఆరోపణలు రావడంతో రిజిస్ట్రేషన్లను నిలిపివేశారు. దీంతో బాధితులు, రెవెన్యూ అధికారులు, కోర్టును ఆశ్రయించారు. సర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలం వైపుగా ఉన్న 39 ప్లాట్లపై అభ్యంతరం తెలుపుతూ హైలెవల్ సర్వే నిర్వహించాలన్న సూచన చేశారు. అప్పటి వరకు ఈ 39 ప్లాట్ల రిజిస్ట్రేషన్లు తాత్కలికంగా నిలిపివేసి మిగతా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయవచ్చంటూ రెవెన్యూ అధికారులు సబ్ రిజిస్ట్రార్‌కు లిఖితపూర్వక ఆర్డర్ కాపీని అందజేశారు. కోర్టు కూడా రిజిస్ట్రేన్లు ఆపవద్దంటూ తీర్పునిచ్చింది. దీంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ తిరిగి యథావిధిగా కొనసాగింది. 3 నెలల నుంచి పాత కారణాలను చూపుతూ ప్రస్తుత కాప్రా సబ్ రిజిస్ట్రార్ తమ ప్లాట్ల రిజిస్ట్రేషన్లను నిలిపివేశారని బాధితులు శుక్రవారం విలేకరులతో గోడు వెల్లబోసుకున్నారు. సమావేశంలో కాలనీ అధ్యక్షుడు సింగిరెడ్డి లక్ష్మారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్, గోపాల్, వెంకట్‌రెడ్డి, దీపక్‌రెడ్డితో పాటుగా పలువురు బాధితులు పాల్గొన్నారు.

**రెవెన్యూ అధికారులు ఇచ్చే రిపోర్టు ఆధారంగా..**

ఈ విషయంపై కాప్రా సబ్ రిజిస్ట్రర్‌ను వివరణ కోరగా .. సాయికృష్ణానగర్ కాలనీకి సంబంధించి రిజిస్ట్రేషన్లు నిరాకరించింది వాస్తవమేనన్నారు. సంబంధిత ప్లాట్లపై అభ్యంతరాలు ఉన్న దృష్ట్యా రెవెన్యూ అధికారులకు లేఖ రాస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు ఇచ్చే రిపోర్టు ఆధారంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై నిర్ణయం తీసుకుంటామని సబ్ రిజిస్ట్రార్ లక్ష్మారెడ్డి తెలిపారు.